క్లుప్తంగా

ఓఆర్ఎస్ వినియోగంపై అవగాహన



ఓఆర్ఎస్ ప్యాకెట్లపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దర్శి(కురిచేడు): స్థానిక అద్దంకి రోడ్డులో ఉన్న దుర్గ గుడి వద్ద నివసిస్తున్న సంచార జాతులకు ఓఆర్ఎస్ వినియోగంపై అవగాహన కల్పించారు. అదే విధంగా అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల చేతుల పరిశుభ్రత, ప్రాముఖ్యత గురించి వివరించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. యుపీహెచ్‌సీహెచ్ వి.సుహాసిని, ఏఎన్ఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



ఈకేవైసీ చేయించుకుంటున్న రైతులు

తాళ్లూరు: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత పొందిన రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. అన్నదాత సుఖీభవపై సోమవారం దోసకాయలపాడు, లక్కవరం, తాళ్లూరు రైతు సేవా కేంద్రాల్లో మాట్లాడారు. మండలంలో 6953 లబ్ధిదారులు ఉండగా 1723 మంది ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారు రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఏ గ్రామంలోఉన్నా కూడా ఆధార్ వివరాలతో ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



పోక్సోపై ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

త్రిపురాంతకం: పోక్సో చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ శివ బసవరాజు తెలిపారు. త్రిపురాంతకం ఎంఆర్సీ భవనంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పోక్సో చట్టంపై వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థినులను స్టాఫ్ రూమ్, ల్యాబ్‌లలోకి ఒంటరిగా పిలవరాదన్నారు. ఎంఈఓ టీ రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో అమలుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై

తాళ్లూరు: క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉత్తమ ఫలితాలు ఉంటాయని ఎస్సై ఎస్ మల్లికార్జునరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్సై ఎస్ మల్లికార్జునరావు సిబ్బందితో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిని గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరమన్నారు. చదువు జీవితంలో ఎదుగుదలకు మార్గదర్శక నిలుస్తుందన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దర్శి(కురిచేడు): దర్శి నగర పంచాయతీలోని కురిచేడు రోడ్డులో నివాసం ఉంటున్న రోజువారీ కూలీ పసుపులేటి బ్రహ్మయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఆ ప్రాంతం వారు బ్రహ్మయ్య కుటుంబ పరిస్థితిని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులకు తెలియజేశారు. స్పందించిన సంస్థ ప్రతినిదులు సోమవారం ఉదయం రూ.5000 లను, అలాగే దాతల సహాయంతో మరో రూ.4000 కుటుంబానికి అందజేశారు. సంస్థ ప్రతినిధులు దేవవతి వరప్రసాదు, కపురం శ్రీనివాసరెడ్డి, గొర్రెపాటి వేణు, జె.సుశీలమ్మ, చీదెళ్ల బసవయ్య, రోశారావు, పాణెం రహిమాన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే కటకటాలే..

- నిబంధనలు పాటించని వారిపై కేసులు
- జరిమానాతో పాటు జైలు శిక్షలు



వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్సై మహేష్

పెద్దదోర్నాల:

తాగి వాహనం నడిపితే జరిమానాలు విధించి వదిలేసే రోజులు పోయి జైలు శిక్షలు విధించే రోజులు వచ్చాయి. రోజురోజుకీ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేలా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అయినా చాలా మందిలో మార్పు కనిపించక పోవడంతో నేరుగా జైలుకే పంపుతున్నారు. మద్యం తాగి వాహనం నడపకుండా జాగ్రత్తలు తీసుకునేలా పోలీసులు శిక్షలను కఠినం చేస్తున్నారు. ఇప్పటి వరకు జరిమానాలతోనే సరిపెట్టిన పోలీసులకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు సవాల్‌గా మారుతున్నాయి. దీంతో శిక్షలు మరింత పెంచి కఠినతరమయ్యేలా చర్యలు చేపడుతున్నారు. కోర్టుల్లో జడ్జిలు కూడా తాగి వాహనం నడిపిన వారిని జైలుకు పంపేలా తీర్పులు ఇస్తున్నారు. పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్‌కి గతంలో బ్రీత్ ఎనలైజర్ పరికరాన్ని సమకూర్చారు. అప్పటి నుంచి కొంత కాలం వరకు తనిఖీలు చేసి జరిమానాలు విధించేవారు. బ్రీత్ ఎనలైజర్ పరికరంతో వాహనదారుడు ఎంత మోతాదులో మద్యం తాగాడో పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతున్నాయి. దీని ప్రకారం వచ్చిన రశీదును మేజిస్ట్రేట్ ముందు పెడితే మోతాదును బట్టి వారికి జైలు శిక్ష విధిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మద్యం తాగి వాహనాలను ఎలాంటి పరిస్థితిలోనూ నడపవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేయాలన్న ఉద్దేశంతోనే ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. ప్రతి కూడలిలోనూ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. వాహనదారుడు ప్రమాదాలను నివారించేలా నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు.

మండల పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల వివరాలు

నెల	నమోదైన కేసుల సంఖ్య
జనవరి	12
ఫిబ్రవరి	18
మార్చి	7
ఏప్రిల్	11
మే	–

నేత్ర పర్వంగా తిరుమలనాథస్వామి రథోత్సవం



రథంపై కొలువుతీరిన శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి



రాజంపల్లిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన గొర్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. రథం ముందు కుంభంపోసి గుమ్మడికాయతో అర్చకులు దిష్టి తీశారు. సాయంత్రం ఉభయ దేవేరులతో కలిసి తిరుమలనాథస్వామి ఉత్సవమూర్తిని రథంపై కొలువుతీర్చారు. ఆలయ ప్రాంగణంలో రథోత్సవం భక్త జనసందోహం నడుమ వైభవంగా జరిగింది. స్వామి వారి నామస్మరణతో భక్తులు పులకించిపోయారు. ఊరేగింపుగా వస్తున్న స్వామి వారిని వందలాది మంది భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు అనంతరం స్వామి, అమ్మవార్లను రథం నుంచి కిందకు దించి ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. సాయంత్రం మహిళలు కోలాటం ప్రదర్శించారు. భక్తుల కోసం అన్ని కులాల సత్రాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభపై పాటకచ్చేరి ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పీ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలయ ప్రాంగణంలో కోలాటం వేస్తున్న మహిళలు




స్వామిని దర్శించేందుకు క్యూలైన్‌లో భక్తులు

చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఆటంకాలు



గ్రామంలో బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు (ఫైల్)



అంతర్గత రహదారుల పక్కన చెట్ల తొలగింపు



గ్రామంలో వీధిలైట్లు వేస్తున్న మెకానిక్‌లు (ఫైల్)

- కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పుల్లలచెరువు: ప్రజల చేత ఎన్నికైన సర్పంచ్ గ్రామాల్లో పనులు చేసినా కార్యదర్శి బిల్లులు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం పుల్లలచెరువు మండలంలోని నాయుడుపాలెం పంచాయతీలో చోటుచేసుకుంది. పంచాయతీలకు 15 ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంతో పంచాయతీ తీర్మానం అనుసరించి కార్యదర్శి అనుమతితో గ్రామంలో వీధిలైట్లు, చెల్లచెట్లు తొలగింపు, గ్రావెల్ రహదారులు, మురికి కాలువల నిర్మాణం, తాగునీటి పైపు లైన్, మంచినీటి బోర్లు మరమ్మతులను సర్పంచ్ ఆవుల నారాయణమ్మ చేశారు. ఈ పనులకు సంబంధించి సుమారు రూ.17 లక్షల మేరకు బిల్లులు రావాల్సి ఉందని, పనులు చేసి సంవత్సరం కావస్తున్నా బిల్లులు కార్యదర్శి పెట్టడం లేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.

పనులు చేసిన వెంటనే కార్యదర్శులు బిల్లులు పెట్టాల్సి ఉండగా సాకులు చెబుతూ కాలం వెళ్లతీస్తున్నారని అన్నారు. గతంలో ఐదేళ్లు కూడా తానే ఈ గ్రామసర్పంచ్‌గా ఉన్నానని, ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కూడా బిల్లులు పెట్టడం లేదని సర్పంచ్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు ఇచ్చేలా చూడాలని కోరుతున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఏఓ



వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ

పెద్దారవీడు: నూతన మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన దొనకొండ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన వ్యవసాయాధికారి కేబుజ్జిబాయి బదిలీపై మార్కాపురం వెళ్లారు. ఈ సందర్భంగా ఏఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలో 5969 మంది రైతు కుటుంబాలు అన్నదాత సుఖీభవకి అర్హత పొందారని తెలిపారు. ఈ పథకం కోసం గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను సంప్రదించి బయోమెట్రిక్ ద్వారా తప్పనిసరిగా వేలిముద్ర వేయాలని రైతులను కోరారు.

కాటమరాజు దేవాలయ అభివృద్ధికి కృషి

మార్కాపురం: వేణూతల కాటంరాజు దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తామని దేవస్థాన కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్, ముఖ్య ప్రతినిధి పీఎల్పీ యాదవ్‌లు తెలిపారు. సోమవారం పట్టణ బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటమరాజు గంగాభవానీ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల యాదవులు, భక్తుల సహకారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తమవంతు వాటాగా రూ.1 కోటి దేవదాయ, ధర్మదాయశాఖ వారికి జమ చేస్తే మరో రూ.2 కోట్లు ఆ శాఖ తరుపున వారు కేటాయిస్తారన్నారు. పైవిషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడామని తెలిపారు. అన్ని ప్రాంతాల వారికి ప్రాతినిధ్యం కల్పిస్తూ ఆలయ కమిటీలో వివిధ హోదాల్లో స్వచ్ఛందంగా సేవలు అందించేవారిని గుర్తించి పదవులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఉన్నటువంటి శివునికి వెండి నాగాభరణాన్ని కమిటీ అధ్యక్షులు గుమ్మా గంగరాజుకు అందచేస్తున్నట్లు పీఎల్పీ యాదవ్ తెలిపారు. ఈసందర్భంగా కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొని వారికి నియామక పత్రాలు అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, ఎం గురుప్రసాద్ యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, ఉపాధ్యక్షుడిగా పాముల పోలురాజు యాదవ్, గంగుల ఎల్లయ్య యాదవ్, బండి రాజగోపాల్ యాదవ్, మెట్ల చెంచయ్య యాదవ్, ఈర్ల ఎర్రయ్య యాదవ్, పాముల పోలురాజు యాదవ్ తదితరులను నియమించారు. కార్యదర్శులుగా కాయకాకుల శ్రీనివాసులు యాదవ్, బి కృష్ణమూర్తి యాదవ్, ఓ లక్ష్మీనారాయణ యాదవ్‌లను ఎన్నుకున్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు



స్కూలు బస్సులు తనిఖీ చేస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి(కురిచేడు): ఫిట్‌నెస్ లేకుండా స్కూలు బస్సులు తిప్పితే చర్యలు తీవ్రంగా వుంటాయని ఎంవీఐ రవికుమార్ హెచ్చరించారు. దర్శిలోని ఎంవీఐ కార్యాలయం వద్ద స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూలు బస్సులను కండీషన్‌లో పెట్టుకోవాలని, అనుభవం కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. అన్ని సక్రమంగా ఉన్న బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. బస్సుకు విధిగా ఇన్సూరెన్సు చేయించాలన్నారు. డ్రైవర్‌తో పాటు క్లీనర్ తప్పక ఉండాలన్నారు.

కార్గో పార్శిల్ ఏజెన్సీకి దరఖాస్తుల ఆహ్వానం

పుల్లలచెరువు: పుల్లలచెరువు ఆర్టీసీ బస్టాండ్ లో కార్గో పార్శిల్ కార్యాలయానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మార్కాపురం డిపో మేనేజర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మార్కాపురం డీఎం కార్యాలయంలో కార్గో సేవలకు సంబంధించి సీల్డ్ టెండర్ కం ఓపెన్ ఆక్షన్ ప్రాతిపదికన కార్గో ఏజెన్సీ ఎంపిక చేస్తారని, ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలొచ్చారు..పంతులెప్పుడొస్తారు..?



ఉపాధ్యాయుడు లేక తరగతి గదిలో ఆటలాడుతున్న విద్యార్థులు



ప్రధ్యానోపాధ్యాయుడి గదికి వేసి ఉన్న తాళం

కురిచేడు: మండలంలోని పడమర కాశీపురం ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులెవ్వరూ రాలేదు. పాఠశాలలోని ఒక తరగతి గది తాళం తీయడంతో విద్యార్థులంతా ఆ గదిలో ఆటలాడుకుంటూ అల్లరి చేసుకున్నారు. పాఠశాలలు పునఃప్రారంభించి నాలుగు రోజులు కూడా కాక ముందే పాఠశాలలకు ఉపాధ్యాయులు రాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇటీవల జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీల్లో అక్కడ పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. కొత్త వారు ఎవరూ ఇంకా వచ్చి అక్కడ విధుల్లో చేరలేదు. కొత్తవారు వచ్చే వరకు ఒక ఉపాధ్యాయుడు అక్కడ తప్పకుండా ఉండాలి. లేదంటే మండలంలోని ఎవరో ఒక ఉపాధ్యాయుడిని లేదా సీఆర్పీనైనా పాఠశాలకు పంపి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టించాల్సి ఉంది. ఈ విషయమై ఎంఈఓ వస్త్రాంనాయక్‌ను వివరణ కోరగా ఆ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని, ఇద్దరు ప్రభుత్వ ఆదేశాల మేరకు రిలీవ్ అయి వెళ్లిపోయారని తెలిపారు. మంగళవారం నుంచి ఒక ఉపాధ్యాయుడు కొత్తవారు వచ్చే వరకు వెళతారని తెలిపారు.

18న పొగాకు రైతులతో ముఖాముఖి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రామయ్య

యర్రగొండపాలెం: పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ మేరకు స్థానిక సీపీఐ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు రైతులతో ముఖాముఖి కార్యాక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖాముఖి కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ పాల్గొని చర్చిస్తారన్నారు. పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులు, నల్లబర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు ఆ బేళ్లను కొనుగోలు చేసే వారులేక తమ ఇళ్ల వద్దనే నిల్వ ఉంచుకుంటున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని, పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, రైతులు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

అర్హులైన పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం జిల్లా నాయకుడు దగ్గుపాటి సోమయ్య, మహిళలు

పెద్దారవీడు: అర్హులైన పేదలందరికీ ఇంటి నివేశ స్థలాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకుడు దగ్గుపాటి సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్హులైన పేదలకు నివేశ స్థలాలు ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు అందలేదని విచారించి అర్హులైన వారి జాబితాను తయారు చేసి ఇంటి నివేశ స్థలాలు ఇవ్వాలని కోరారు. గ్రామం సమీపంలో దోర్నాల రోడ్డులో చెరువు పక్కన పుచ్చకాయల బోడు వద్ద ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిలో ఇంటి నివేశ స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జీ రాజశేఖరరెడ్డి, రైతు సంఘం నాయకులు మూడమంచు సుబ్బయ్య, బత్తుల కాశయ్య, నాలి వెంకటేశ్వర్లు, బీ కాశయ్య తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న హెచ్ఎం

దర్శి(కురిచేడు): దర్శి మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి సోమవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి గోపాలుని సూర్యప్రకాశ్ వారి అమ్మనాన్నలు చిన్న మల్లయ్య, లక్ష్మమ్మ జ్ఞాపకార్థం మెమెంటో, రూ.1,116 అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించిన ఏ షణ్ముఖ పవన్, బి.శ్రావణి, సీహెచ్ హిమజలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి గురుప్రసాదు, ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. ఎన్ఎంఎంఎస్‌లో మెరిట్ సాధించిన ఆరుగురు విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు బహూకరించారు.

దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రం ద్వారా సేవలు

- ఎంఈఓ రాజశేఖరరెడ్డి



త్రిపురాంతకం భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులతో ఎంఈఓ తదితరులు

త్రిపురాంతకం: ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాల ద్వారా సేవలందిస్తున్నట్లు ఎంఈఓ టీ రాజశేఖరరెడ్డి తెలిపారు. త్రిపురాంతకం భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ చిన్నారులకు అవసరమైన అలవెన్సులను తల్లి ఖాతాల్లో అందిస్తారన్నారు. వినికిడి యంత్రాలు, ఎమ్మార్ కిట్లు, వీల్ చైర్లు అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ బాలవిజయ, నాసిర్ హుస్సేన్ పాల్గొన్నారు.